బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 24 ఆగస్టు 2025 www.balagamtv.com పేజీలు 4


## నేడు సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయం 'గాంధీ'కి అప్పగింత

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి (83) శుక్రవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్ నుంచి మఖ్దూం భవన్‌కు తరలించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజల సందర్శనార్థం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మఖ్దూం భవన్‌లో భౌతికకాయాన్ని ఉంచనున్నారు. అనంతరం అక్కడి నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమయాత్ర జరగనుంది. సాయంత్రం 5 గంటలకు ఆయన పార్థివదేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధన కోసం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్లు సీపీఐ ప్రకటించింది.

# స్థానిక ఎన్నికలపై సెర్చ్ కమిటీ



- పార్టీపరంగా బీసీలకు 42 శాతం టిక్కెట్లు
- బీసీ రిజర్వేషన్లపై న్యాయ నిపుణుల కమిటీ
- 'స్థానికం'కు పార్టీని సిద్ధం చేద్దాం
- 29న మంత్రివర్గ సమావేశం
- టీపీసీసీ పీఏసీ సమావేశంలో నిర్ణయాలు
- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పార్టీపరంగా సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయాలని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) నిర్ణయించింది. ఆ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా నియమించారు. ఈనెల 28వ తేదీలోపు ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పార్టీపరంగా బీసీలకు 42 శాతం టిక్కెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. స్థానిక ఎన్నికలు నిర్వహించాలా...వద్దా అనే అంశాన్ని ఈ కమిటీ నిర్ణయిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా ఈనెల 29న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. శనివారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బీ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలను నిర్వహించాలనే హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. తాజా రాజకీయ పరిణామాల పై చర్చించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీపై సుదీర్ఘంగా చర్చించింది. యావత్తు పార్టీని స్థానిక ఎన్నికలకు సంసిద్ధం చేయాలని దిశా నిర్దేశం చేసింది. ఈ ఎన్నికలతో ముడి పడి ఉన్న బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తేల్చేందుకు న్యాయ నిపుణుల సలహాలను తీసుకోవాలని భేటీలో నిర్ణయించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్రానికి చెందిన ప్రజాస్వామ్య వాది, రాజ్యాంగ నిపుణులు జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల పీఏసీ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొంటూనే...జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మంగా తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని క్యాడర్‌ను ఇప్పటికే సమాయత్తం చేస్తున్నారనీ, దాన్ని మరింత విస్తృతం చేయాలని సూచించారు. ముఖ్యంగా నాయకుల మధ్య ఐక్యతను సాధించే దిశగా కృషి చేయాలని సమావేశం ఆదేశించింది.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్ర ప్రభుత్వం దూసుకుపోతుంటే, మరోవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బదనాం చేసేలా వ్యవహరిస్తున్నాయని సమావేశం అభిప్రాయపడింది. రాష్ట్రంలో యూరియా సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం కారణమైతే... రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని బీజేపీ, బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయనీ, ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడంలో పార్టీ నాయకులు విఫలమవుతున్నారనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసినట్టు తెలిసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఉన్న ఫిర్యాదులను స్పీకర్ పరిశీలించి, ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశంపై చర్చించారు.

పీఏసీ సమావేశంలో 'ఓట్ చోరీ' ప్రచార లోగోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈనెల 26న ఓట్ చోరీపై ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి బీహార్‌లో పర్యటించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడమనేది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లక్ష్యమని చెప్పారు. అందువల్ల బీసీలకు మేలు జరగాల్సిందేనన్నారు. రాహుల్‌గాంధీ, పార్టీ ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో కులగణన చేపట్టామని తెలిపారు. బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రి వర్గంలో ఆమోదించి అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసుకున్నామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50శాతానికి మించకుండా కేసీఆర్ చట్టం తీసుకొచ్చారని గుర్తు చేశారు. దీని ప్రకారం బీసీలకు ఒక శాతం కూడా రిజర్వేషన్లు రావని తెలిపారు. ఈ అడ్డంకిని తొలగించేందుకు తాము ఆర్డినెన్స్ తెచ్చామన్నారు. కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చిన గవర్నర్‌కు పంపితే, ఆయన కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. 90 రోజుల్లో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశంపైన సుప్రీం కోర్టులో రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించినట్టు తెలిపారు. అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుందన్నారు. విడిగా సుప్రీం కోర్టుకు వెళ్తే కేసు లిస్ట్ కావడానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు.

### పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు

# స్పీకర్ నోటీసులు



- ఐదుగురికి నోటీసులు
- పార్టీ మారడంపై 30 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు
- మరో ఐదుగురు ఫిరాయింపుదారులకు త్వరలో..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పార్టీ ఫిరాయింపు కేసులో బీఆర్ఎస్ ఫిర్యాదు మేరకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఐదుగురికి ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. మూడు నెలల్లోగా అనర్హత పిటిషన్లపై విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించిన నేపథ్యంలో ఈ చర్య చేపట్టినట్లు సమాచారం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో చర్చించిన అనంతరం స్పీకర్ నోటీసులు జారీ చేశారు. 10 మంది ఎమ్మెల్యేలలో ఐదుగురికి శుక్రవారం (ఆగస్టు 22) నోటీసులు పంపగా, మిగతావారికి త్వరలో ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం నుంచే విచారణలు ప్రారంభమయ్యే అవకాశముందని స్పీకర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, దానం నాగేందర్, సంజయ్‌కుమార్, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్ ఉన్నారు.

ఈ నోటీసులపై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పందించారు. తనకు స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసు అందిందని, న్యాయ నిపుణులతో చర్చించి వివరణ ఇస్తానని తెలిపారు. తాను పార్టీ మారలేదని, టెక్నికల్‌గా ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని వివరించారు.

## ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుంది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఒకవైపు యూరియా కొరతతో రాష్ట్ర రైతాంగం అల్లకల్లోలం అవుతుంటే అధికార పక్షం దాన్ని ప్రతిపక్షాల దుష్ప్రచారంగా చెప్పడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుందని మండిపడ్డారు. కుండపోత వానలో తడుస్తూ రైతులు గంటల కొద్దీ నిలబడటం అబద్ధమా అని మండిపడ్డారు. ఆధార్ కార్డులు, పాస్ బుక్కులు, చెప్పులు క్యూలైన్లలో పెట్టడం అబద్ధమా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. యూరియా బస్తాలు ఇవ్వాలంటూ రైతన్నలు అధికారుల కాళ్లు పట్టుకొని వేడుకున్నది అబద్ధమా? దేశానికి అన్నం పెట్టే రైతన్న యూరియా అడిగితే పోలీసు లాఠీలతో కొట్టించింది అబద్ధమా? కాంగ్రెస్ ఎంపీల యూరియా పోరాటం ఫలించిందని చెప్పుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి సిగ్గనిపిస్తలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చేతగాని తనం వల్లనే కదా ఈరోజు రైతులకు ఇన్ని కష్టాలు వచ్చిందని తెలిపారు. ఈ ముఖ్యమంత్రికి ముందు చూపు లేకపోవడం వల్లనే కదా రైతులు కన్నీళ్లు పెట్టాల్సి వస్తున్నదని మండిపడ్డారు.

తులం బంగారం ఇస్తామంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, బంగారం మాట దేవుడెరుగు యూరియానే బంగారంగా మార్చిండని హరీశ్‌రావు విమర్శించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులైపారిస్తున్న రేవంత్ రెడ్డి, యూరియా బస్తాలను అందుబాటులో ఉంచడంలో అట్టర్ ఫ్లాప్ అయ్యిండని మండిపడ్డారు. బూటకపు వాగ్దానాలు చేసినంత సులువు కాదు, పరిపాలన చేయడం అంటే అని ఎద్దేవా చేశారు. నమ్మి నయవంచన చేసినంత సులువు కాదు, కేసీఆర్ అందించిన రైతు సంక్షేమాన్ని కొనసాగించడం అంటే అని పేర్కొన్నారు. నాటి రోజులు తెస్తామని పదే పదే చెప్పే రేవంత్ రెడ్డి..అన్నమాట నిలుపుకుంటున్నడని.. మళ్లా కాంగ్రెస్ దుర్మార్గ పాలన నాటి పాత రోజులను తీసుకొచ్చిండని మండిపడ్డారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఏనాడూ యూరియా కొరత రాలేదని హరీశ్‌రావు అన్నారు. ఏనాడూ రోడ్డెక్కాల్సిన దుస్థితి రాలేదని గుర్తుచేశారు. యూరియా కొరతకు కారణమైన వారే ఈరోజు యూరియా పేరు చెప్పి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. మిస్ వరల్డ్ పేరిట రెండు నెలలు పాలనను గాలికి వదిలేసిండు తప్ప, ఎరువులు, విత్తనాల గురించి సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు చేయలేదని.. బాధ్యత లేదు, మిగితా 4వ పేజీలో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కసరత్తు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అనుసరించనున్న వ్యూహంపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్, ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్‌పెరుమాళ్ ప్రజాభవన్‌లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామిలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముందుకెళ్లే వ్యూంపై మంత్రులకు ఏఐసిసి కార్యదర్శి దిశనిర్దేశం చేశారు. ఉప ఎన్నికను గెలిచేందుకు ప్రణాళికా బద్దంగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులకు దిశానిర్దేశనం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వడ్డీలేని రుణాలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి బూత్‌కు ఒకరు ఇంచార్జ్‌గా ఉండి పారిశుధ్య,తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఎక్కడా ఉండకుండా చూడాలని తెలిపారు. బూత్‌ల వారీగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెండింగ్‌లో ఉన్న ఇతర పథకాలను పూర్తి చేయాలన్నారు

## దసరా, దీపావళి రద్దీకి 170 ప్రత్యేక రైళ్లు

- దక్షిణ మధ్య రైల్వే

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే 170 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ప్రకటించింది. సెప్టెంబర్ 7 నుంచి 28 వరకు తిరుపతి-చర్లపల్లి (07481) మధ్య నాలుగు రైళ్లు, సెప్టెంబర్ 8 నుంచి 29 వరకు చర్లపల్లి%-%తిరుపతి (07482) మధ్య నాలుగు రైళ్లు నడుస్తాయి. అలాగే సెప్టెంబర్ 5 నుంచి 26 వరకు ప్రతి శుక్రవారం చర్లపల్లి-తిరుపతి (07011), సెప్టెంబర్ 6 నుంచి 27 వరకు ప్రతి శనివారం తిరుపతి%-%చర్లపల్లి (07012) ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ రైళ్లు కాచిగూడ, మహబూబ్‌నగర్, కర్నూలు, కడప, రాజంపేట, రేణిగుంట వంటి స్టేషన్ల మీదుగా ప్రయాణించనున్నాయి. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం తిరుపతి%-%హిస్సార్ (07717) మధ్య, అక్టోబర్ 5 నుంచి నవంబర్ 30 వరకు ప్రతి ఆదివారం హిస్సార్%-%తిరుపతి (07718) మధ్య ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఈ రైలు తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల పలు ముఖ్య స్టేషన్ల మీదుగా వెళ్లనుంది. అలాగే నాందేడ్%-%ధర్మవరం (07189/07190), బెంగళూరు%-%బీదర్ (06530/06540), యశ్వంత్‌పూర్%-%ధన్‌బాద్ (06563/06564) రైళ్లను కూడా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

## బెట్టింగ్ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చట్ట విరుద్ధమైన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కేసులో కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కెసి వీరేంద్ర పప్పీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. శుక్రవారం సిక్కిం రాజధాని గాంగ్‌టక్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటించింది. ఈడీ వెల్లడించిన వివరాల ప్రకారం, రూ.12 కోట్ల నగదు (విదేశీ కరెన్సీ సహా), రూ.6 కోట్ల విలువైన నగలు, 10 కేజీల వెండి, నాలుగు విలాసవంతమైన వాహనాలను స్వాధీనం చేసుకుంది. అయితే అవి ఏ ప్రదేశాల్లో స్వాధీనం చేశారన్నది స్పష్టంచేయలేదు. ప్రస్తుతం చిత్రదుర్గ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న వీరేంద్ర, క్యాసినో లీజు నిమిత్తం సహచరులతో కలిసి గాంగ్‌టక్ వెళ్లినట్లు తెలిపింది. ఆయనను మేజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది.బెంగళూరు జోన్‌కు చెందిన ఈడీ బృందం కేసు దర్యాప్తు కొనసాగిస్తోంది. చిత్రదుర్గ, హుబ్బళ్లి, బెంగళూరు, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, సిక్కిం, ముంబై, గోవా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపింది.

ఈ దర్యాప్తులో భాగంగా వీరేంద్ర సోదరుడు కెసి నాగరాజు, ఆయన కుమారుడు పృథ్వీ నివాసాల నుంచి విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. మరో సోదరుడు కెసి తిప్పేస్వామి దుబాయి నుంచి ఆన్‌లైన్ గేమింగ్ దందా నడుపుతున్నాడని తెలిపింది. గోవాలోని పప్పీ క్యాసినో గోల్డ్, ఓషన్ రివర్స్ క్యాసినో, పప్పీస్ క్యాసినో ప్రైడ్ సహా పలు కేంద్రాలపై దాడులు నిర్వహించిందని సమాచారం.

వీరేంద్ర కింగ్ 567, రాజా 567, పప్పీస్ 003, రత్న గేమింగ్ వంటి ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యాపారాలు నడుపుతున్నారని, ఆయన సోదరుడు తిప్పేస్వామి దుబాయ్ నుంచి డైమండ్ సాఫ్ట్‌టెక్, టిఆర్ఎస్ టెక్నాలజీస్, ప్రైమ్9 టెక్నాలజీస్ పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నట్లు ఈడీ పేర్కొంది. వీరికి చెందిన 17 బ్యాంకు ఖాతాలు, రెండు లాకర్లు సీజ్ చేసినట్లు కూడా వెల్లడించింది. అయితే ఈడీ దాడులపై వీరేంద్ర కుటుంబం, కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు స్పందించలేదు. వీరేంద్ర లీగల్ టీమ్ ఈ కేసుపై అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం.

## కర్ణాటక ధర్మస్థల కేసులో కొత్త మలుపు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వందలాది మృతదేహాల ఖననం జరిగిందన్న ఆరోపణలతో దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కర్ణాటక ధర్మస్థల కేసులో సంచలన మలుపు చోటుచేసుకుంది. ఇప్పటివరకు రేప్, హత్యల అనంతరం వందల మృతదేహాలను ఖననం చేశానని చెప్పిన పారిశుధ్య కార్మికుడు చిన్నయ్య అలియాస్ చెన్నా ఇప్పుడు తనకేమీ తెలియదంటూ యూ-టర్న్ తీసుకున్నాడు. సిట్ విచారణలో అతడు, "కొంతమంది ఒక పుర్రెను చేతికిచ్చి అధికారులకు ఫిర్యాదు చేయమని, కోర్టులో కేసు కూడా వారే వేయించారని" చెప్పినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో అతడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇక తన కుమార్తె అదృశ్యమైందని బెంగళూరుకు చెందిన ఓ మహిళ చేసిన ఫిర్యాదు కూడా కట్టుకథగానే తేలిందని పోలీసులు స్పష్టం చేశారు. చిన్నయ్య వాంగ్మూలం ఆధారంగా తవ్వకాలు జరిపినా ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో సిట్‌కు అనుమానం వచ్చి, మళ్లీ ప్రశ్నించగా అబద్ధాలు చెబుతున్నట్టు తేలినట్లు తెలిపారు. ఇప్పటివరకు సాక్షిగా రక్షణ కల్పించిన చిన్నయ్యను అబద్ధపు సాక్ష్యం కారణంగా అరెస్ట్ చేసి, అతని పేరును మొదటిసారి అధికారికంగా ప్రకటించారు.

# నిర్ణయాలు కఠినంగా తీసుకున్నా ఫలితాలు బాగుంటాయి

- హైడ్రా ఏర్పడిన తర్వాత అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు
- పేదల ఇండ్లు కూల్చివేయం
- మంచి వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- 'మీట్ ది ప్రెస్'లో హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైడ్రా రాజకీయాలకతీతంగా పనిచేస్తోందని, ఒకటి రెండేండ్లకు పరిమితం కాదని, వందేండ్ల ప్రణాళికతో ముందుకు వెళ్తోందని హైడ్రా కమిషనర్, ఐజీ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. వ్యక్తుల ప్రయోజనాలకన్నా ప్రజల ప్రయోజనాలకు మాత్రమే హైడ్రా ప్రాధాన్యత ఇస్తుందని, ఎవరో చెప్పారని గుడ్డిగానమ్మి పనిచేయమన్నారు. అన్ని అంశాలపై పూర్తిగా అద్యాయనం చేసిన తర్వాత ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. కొన్ని సందర్భాలల్లో మేథావులు, నిపుణులతో రాత్రి 11గంటల వరకు చర్చించిన రోజులున్నాయని తెలిపారు. హైడ్రా ఏర్పడి ఏడాదికాలం పూర్తయిన నేపథ్యంలో 'మహానగర అభివృద్ధి - ఆటంకాలు' అనే అంశంపై 'టీయూడబ్ల్యూజే' నేతృత్వంలో 'మీట్ ది ప్రెస్' నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి 'టీయూడబ్ల్యూజే' అధ్యక్షులు కే. విరహత్ అలీ అధ్యక్షత వహించారు. హైడ్రాపై ప్రజల్లో నెలకొన్న ఆపోహాలు, వివాదాలు, అనుమానాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. మొదట్లో ఏ సంస్థకైనా ఒడుదుడుకులు తప్పవని, హైడ్రా కూడా అనేక అవరోధాలు, విమర్శలను ఎదుర్కొంటూ ఏడాది కాలంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రజల్లో హైడ్రా పట్ల నమ్మకం పెరిగిందనడానికి కూకట్‌పల్లి నల్ల చెరువు నిదర్శనమని తెలిపారు. విపత్తుల నుంచి నగర ప్రజలను రక్షించేందుకు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కషి చేస్తున్నామని తెలిపారు. హైడ్రాను ఇతర జిల్లాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ వస్తోందని, హైడ్రా పనితీరు చూసి, ప్రభుత్వం మరిన్ని అధికారాలను కల్పిస్తూ హైడ్రాను మరింత బలోపేతం చేసిందన్నారు. హైడ్రాలో ప్రస్తుతం 200 మంది సిబ్బంది వరకు పనిచేస్తున్నారని తెలిపారు. కొన్ని నిర్ణయాలు కఠినంగా తీసుకున్నా వాటి ఫలితాలు భవిష్యతులో బాగుంటాయని, అదే తరహాలు కబ్జాదారుల నుంచి నగరాన్ని కాపాడి రాబోయే తరాలవారికి మంచివాతావరణం, అభివృద్ధిని అందిస్తామన్నారు. ఏడాది కాలంలోనే హైడ్రా గురించి అందరికి తెలిసిందని, తక్కువ సమయంలో దేశంలో ఏ సంస్థకు ఇంతలా ప్రచారం కాలేదన్నారు. హైడ్రా పనితీరుతో ప్రతి ఒక్కరిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై అవగాహన వచ్చిందన్నారు. ఫిర్యాదులు సైతం పెరిగాయన్నారు. ప్రజలు అందించే సలహాలు సూచనలతోపాటు విమర్శలనూ స్వాగతిస్తామన్నారు. పార్కులు, నాలాలు, చెరువులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆ తర్వాత ప్రభుత్వ భూములు, లేఆవుట్స్, ఎంన్‌క్రోచ్‌మెంట్స్‌పై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు కోట్లు విలువచేసే 500ఎకరాల ప్రభుత్వం స్థలాలను కాపాడమని, ప్రస్తుతం ఆరు చెరువులను అభివద్ధి చేస్తున్నామని తెలిపారు. సీఎస్ఆర్ పేరుతో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారని చెప్పారు. 50 ఎకరాలున్న చెరువు 12ఎకరాలు అయిందని, అదే తరహాలో నాలాలు సైతం ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని చెరువులకు సాంకేతిక ఆధారాలతో ఎఫ్‌టీఎల్ మార్కు చేస్తున్నామని, వీటితో పాటు నాలాలను నోటిఫై చేస్తున్నామన్నారు. కావాలనే కొందరు మిగితా 4వ పేజీలో



# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**బలగం టీవీ, బోయినిపల్లి:**

బోయినిపల్లి మండల కేంద్రంలో పనుల జాతరలో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బోయినిపల్లి మోడల్ స్కూల్ వెళ్లేందుకు 25లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన సిసి రోడ్డును శంకుస్థాపన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు. అనంతరం బోయినిపల్లి గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ ను సాలువాలతో సన్మానించారు. అనంతరం స్తంభంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబోయే అంగన్వాడీ భవనాన్ని శంకుస్థాపన చేసి, భూమి పూజ చేశారు. అలాగే మల్టీపర్పస్ వర్కర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేస్ యాదవ్, ఎంపీడీవో జయశీల, ఇన్చార్జి తహశీల్దార్ భూపేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, సింగిల్ విండోచైర్మన్లు జోగినిపల్లి వెంకటరమణరావు, వేసిరెడ్డి దుర్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

- **ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఫీజు దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ ఫీజు దీక్ష ను ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శులు మల్లారపు అరుణ్ కుమార్, ఎర్రవెల్లి నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ 8158 వేల కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని వాటిని విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉన్నత చదువుల కోసం వెళ్లాలంటే ప్రైవేటు యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు డబ్బులు కట్టలేక మధ్యలోనే చదువులు ఆపేసే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచడంలో విఫలమైందని అన్నారు అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. వెంటనే స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమ కార్యచరణ ప్రకటించుకొని విద్యార్థులందరినీ కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఫీజు దీక్షలో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫీజు దీక్షకు మద్దతుగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గాంతుల మహేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లారెడ్డి రమణ లు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గుండెల్లి కళ్యాణ్, ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన జిల్లా కమిటీ సభ్యులు శివ, భరత్, జశ్వంత్, నాయకులు తిరుపతి, మహేష్, నవీన్, శివ చరణ్, అజయ్, దినకర్, ప్రసంగి, జలంధర్, అఖిల, అక్షయ, ప్రనుష తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కరించాలి

**మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు అక్కనపల్లి కరుణాకర్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**



మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ కు వినతి పత్రం ఇచ్చేందుకు మాజీ సర్పంచ్ లకు అవకాశం కల్పించాలని మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు అక్కనపల్లి కరుణాకర్ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో పత్రికా సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అనేక వ్యయ ప్రయాసాలకు ఓర్చి గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ, అప్పులు చేశామని కానీ ఇప్పటికి బిల్లులు మంజూరు కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు ఇచ్చేలా కృషి చేయాలని కోరుతూ మీనాక్షి నటరాజన్ కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒకవేళ అరెస్టులు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు చిందం రమేష్, ఇల్లందుల శంకరయ్య, గుంటి శంకర్, ల్యాద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం



- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వాన్ని అందిస్తాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని నాంపల్లిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేములవాడ అర్బన్ మండల స్థాయి ఆటల పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, క్రీడా పోటీలు కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా, ఇతర ప్రాంతాల వారితో స్నేహ సంబంధాలు పెంచుకోవడానికి కూడా ఉపయోగపడతాయని తెలిపారు.యువత సరైన మార్గంలో పయనించేలా, గంజాయి రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రూపొందించిన ప్రణాళికలను పోలీసు అధికారులు కచ్చితంగా అమలు చేయాలని ఆది శ్రీనివాస్ సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిని మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

2036 ఒలింపిక్స్లో తెలంగాణ నుంచి క్రీడాకారులు పతకాలు సాధించే లక్ష్యంతో ప్రభుత్వం 'క్రీడా జ్యోతి పాలసీ'ని రూపొందిస్తోందని శ్రీనివాస్ వెల్లడించారు. గచ్చిబౌలి స్టేడియంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. వేములవాడ ప్రాంతం నుంచి ఇటీవల ఐదుగురు(5) విద్యార్థులు క్రీడా పాఠశాలకు ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వేములవాడలో మినీ స్టేడియం పనులు వేగంగా జరుగుతున్నాయని, మర్రిపల్లిలో ఐదు ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**ఆరోగ్యానికి మించిన సంపద లేదు**

ఆరోగ్యమే మహాభాగ్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మెడికవర్ హాస్పిటల్ మరియు టీయూడబ్ల్యూజే హెచ్-143 ప్రెస్ క్లబ్ సంయుక్తంగా వేములవాడలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ శిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ అనీష్ పబ్బ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేష్ వంటి నిపుణులైన వైద్యులు ప్రజలకు సేవలు అందించారు. బిపి, షుగర్, ఈసీజీ, టూ డీకో వంటి పలు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని మెడికవర్ సిబ్బందికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు కట్టుబడి ఉందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచడం ద్వారా ఈ నిబద్ధతను చాటుకుందని ఆయన తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా అవగాహన కల్పించేందుకు కృషి చేసిన ప్రెస్ క్లబ్ మరియు మెడికవర్ ఆసుపత్రిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కరీంనగర్ మార్కెటింగ్ హెడ్ శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, ప్రెస్ క్లబ్ సభ్యులు అయాచితుల జితేందర్ రావు, మహమ్మద్ అలీ, కొత్వాల్ శ్రీనివాస్, కమలాకర్, ఓరగంటి విష్ణు, దేవరాజు, వేణు, హరీష్, ప్రవీణ్ కుమార్, సంతోష్, పంపరి నాగరాజు, సంటి రాజేందర్ మరియు మెడికవర్ వైద్య సిబ్బంది, తదితర ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌ది పాదయాత్ర కాదు పనికిరాని యాత్ర..



**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్**

**బలగం టీవీ, గంగాధర**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురనగర్ గ్రామంలో అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం రోజున మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ.. అధికారంలోకి రావడం కోసం కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు.6 గ్యారంటీల అమలు పేరుతో హామీలు ఇచ్చి, రైతులను, మహిళలను, యువతను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.

రైతు రుణమాఫీ విషయంలో రెండు లక్షల వరకు ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు రైతులను అప్పుల బారిన పడేసారని అన్నారు. అదేవిధంగా మహిళలకు ప్రతినెల రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి, ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని తెలిపారు. వృద్ధులకు 4000 పెన్షన్, ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం, ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి రైతుకు 15వేల రైతు భరోసా, కౌలు రైతులకు భరోసా వంటి అనేక హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం చెందిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానే గ్రామాలలో అభివృద్ధి జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఒక్క గ్రామంలోనూ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేదని అన్నారు. గ్రామపంచాయ తీలకు నూతన భవనాలను నిర్మించడంలో మరియు అంగన్వాడి కేంద్రాలు నిర్మాణం ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని నిధులు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తే,కాంగ్రెస్ పార్టీ గ్రామాలలో ప్రారంభోత్సవాలు చేసుకుంటూ, తమ నిధులని చెప్పుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం అని చెప్పుకోవడం చాలా సిగ్గుచేటని ఈ సందర్భంగా అన్నారు.

ఆదివారం రోజున గంగాధర మండలంలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ముందుగా చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చారో శ్వేతపత్రం విడుదల చేసిన తర్వాతే పాదయాత్ర చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.లేకపోతే ప్రజలు,మహిళలు, యువత పాదయాత్రను అడ్డుకుంటారని హెచ్చరించారు.గంగాధర మండలంలోని నారాయణపూర్ నిర్వాసితులను ఆదుకుంటామని, అలాగే ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని, చెప్పిన హామీలను స్థానిక ఎమ్మెల్యే నెరవేర్చలేదని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేవలం మాటలకే పరిమితమయ్యారు. చొప్పదండి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు.ప్రజా సమస్యలను పరిష్కరించిన తర్వాతే ఈ ప్రాంతంలో పాదయాత్ర చేయాలని స్పష్టం చేశారు.గతంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ కూడా రైతుల సమస్యలు పరిష్కరించలేకపోయిందని, వారి పాలనలో యూరియా కోసం రైతులు పడిన కష్టం, రుణమాఫీ చేయకపోవడంతో ఆత్మహత్యలు చేసిన రోజుల్ని మరువలేమన్నారు. బిఆర్ఎస్ చేసిన పాపాలే ఇప్పుడు రైతులను అప్పుల ఊబిలోకి నెట్టాయని విమర్శించారు.బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలూ ప్రజలను మోసం చేసి, సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చాయని, బిఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పినట్టుగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కూ ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వైద రామానుజం, మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్, మోడీ రవీందర్, గాజుల మల్లేశం, బండ నరసింహారెడ్డి, ఎడెల్లి పరుశురాం, చిల్ల శ్రవణ్, మహేష్, మాజీ మండల అధ్యక్షులు కోల అశోక్, ఎడవెల్లి శశిధర్ రెడ్డి, తుమ్ నారాయణ, సదాల భాస్కర్, శ్రీపతి రాజేంద్రప్రసాద్, మల్యాల వినయ్ సాగర్, సుద్దాల రవీందర్ రెడ్డి, పెంచాల రాములు, గాలిపల్లి శ్రీనివాస్, మోతే నరసింహారెడ్డి, పోచంపల్లి నరేష్, శ్రీకాంత్, రేండ్ల శ్రీనివాస్, వోడ్నాల రాజు, బొమ్మకంటి రాజిరెడ్డి, తాళ్ల రాజశేఖర్, విజయేందర్ రెడ్డి, దేశెట్టి శ్రీనివాస్, పెరుక శంకర్, అనిల్, వేముల గంగయ్య, మండల బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు..

**-శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి...**

**-ఎస్పీ మహేష్ బి.గితే**



**బలగం టివి, రాజన్న సిరిసిల్ల**

గణేష్ నవరాత్రి వేడుకల సందర్భంగా మండపాల్లో , శోభాయాత్ర రోజున డీజే లకు అనుమతి లేదని,అనుమతి లేకుండా డీజే మండపాల్లో కానీ నిమార్జనం రోజు ఉపయోగిస్తే డీజే యజమానులతో పాటుగా మండపాల నిర్వహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు.శనివారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక కల్యాణ మండపంలో హిందు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వహకులతో సమావేశం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఎస్పీ మహేష్ బి.గితే హాజరై గణేష్ నవరాత్రి ఉత్సవాలు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై పాటించవలసిన నియమ నిబంధనాలపై దిశ నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ పోలీస్ వారికి సహకరిస్తు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని,పోలీస్ శాఖ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు.ప్రజా రవాణాకు,ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది తలెత్తకుండా గణేష్ మండపాలను పోలీస్ వారు అనుమతితో ఏర్పాటు చేసుకోవాలని,నిబంధనలకు లోబడి గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి,ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అన్నారు.గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన రోజు నిర్దిష్ట సమయానికి విగ్రహాలను మండపానికి చేరుకునే విధంగా నిర్వాహకులు చూసుకోవాలని,చివరి రోజు మధ్యాహ్నం నుండే గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించి,నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తయ్యే విధంగా సహకరించాలన్నారు.

మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వహకులదని,ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పకుండ ఏర్పాటు చేయలని, మండపాల వద్ద మద్యం సేవించడం,అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే వారితో పాటుగా మండపాల నిర్వహకులు పై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ప్రతి మండపం వద్ద విధిగా పాయింట్ బుక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పోలీస్ అధికారులు,బ్లూ కోల్ట్ సిబ్బంది తరచు మండపాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

నవరాత్రి వేడుకలు సందర్భంగా మండపాల వద్ద, శోభాయాత్రలో డిజే లకు అనుమతి లేదని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే అని, పోలీస్ వారి అనుమతితో మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు.

**సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా...**

సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై, వాస్తవాలను తెలుసుకోకుండా అట్టి పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజ నిజాలు తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లో అట్టి మెసేజ్లను ఫార్వర్డ్ చేయకూడదని సోషల్ మీడియా పై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సోషల్ మీడియా విభాగం ప్రతి పోస్టు ను నిశితంగా పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా ,పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్.ఐ లు శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవు

**జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలి**

**కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి**

**బలగం టివి, బోయినిపల్లి**

చొప్పదండి నియోజకవర్గంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ఆదివారం తలపెట్టిన జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని తెలిపారు. బోయినిపల్లిలో మహేశ్వర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల ఉప్పరిమల్లెల నుండి మధురానగర్ వరకు జనహిత పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.ఈ పాదయాత్రకు రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పి.సి.సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మన్ లు హాజరైతున్నందున బోయినిపల్లి మండలం నుండి అధిక సంఖ్యలో నాయకులు,కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. బోయినిపల్లి కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని, కానీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పనిచేస్తున్నామని, ఎలాంటి విభేదాలు




## కేసిఆర్, కేటీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి

**-కంచర్ల రవి గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జగ్గారెడ్డి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్లపై చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా ఖండించారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగ్గారెడ్డి తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, అలాగే ఐటీ రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలపడానికి కేటీఆర్ అవిశ్రాంతంగా కృషి చేశారని రవి గౌడ్ కొనియాడారు. అలాంటి నాయకులపై అవాస్తవాలు మాట్లాడటం సహించబోమని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం కీలక పాత్ర పోషించిందని రవి గౌడ్ గుర్తు చేశారు. తెలంగాణ బిడ్డలను బలిగొన్న కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్, కేటీఆర్లపై మాట్లాడే నైతిక అర్హత లేదని ఆయన స్పష్టం చేశారు. "ఎవరు అవకాశవాదులో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కేటీఆర్ అభిమానులుగా మేము చూస్తూ ఊరుకోము," అని రవి గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వడ్లూరి సాయి, సూర్య, ఎస్.కె అప్రోచ్, శ్రీనివాసరావు, కిరణ్, రాజేష్, అర్జున్, సంతోష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల్లారా... చూడండి.. కళకళలాడే కాళేశ్వరం జలాలను



**-రాజన్న సిరిసిల్ల జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు సిద్ధం వేణు**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

కాంగ్రెస్ ముఖ్యమంత్రి ,మంత్రులారా కండ్లు పెద్దగా చేసుకొని చూడండి కాళేశ్వరం జలాలని అని రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ సిద్ధం వేణు అన్నారు.ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ వద్ద బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పల్లె నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినా సిద్ధం వేణు మాట్లాడుతూ సమైక్యాంధ్ర పాలనలో సాగునీళ్లు కోసం గోసపడ్డ తెలంగాణ రైతులు తెలంగాణ ను ఎడారిగా మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ బరాజ్ కు రిపేర్ చేయడం లేదనీ కూలిపోయిందన్నా కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పుడు నీళ్ళేట్ల ఎత్తిపోస్తున్నారు అని ఆయన ప్రశ్నించారు.

కేసీఆర్ పై కోపంతో రైతులను నిండా ముంచొద్దు

అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా ఇల్లంతకుంట,బెజ్జంకి మండలాల్లోని చెరువులను నింపాలనీ ఆయన అన్నారు.స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇక్కడి చెరువులు నింపే విధంగా అధికారులతో మాట్లాడాలన్నారు.మేడిగడ్డ బరాజ్ లో రెండు ఫిల్లర్లు కుంగితే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి పడావు పెట్టేలా వ్యవహరిస్తున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్ లో ఎత్తిపోస్తున్న కాలేశ్వరం నీళ్లను కాంగ్రెస్ నాయకులు కళ్ళు అప్పగించి చూడాలనీ ఆయన అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి నియంత పాలన సాగిస్తున్నారనీ,

రైతులకు సాగునీళ్లు ఇవ్వడం లేదు.పంట పొలాలకు యూరియా ఇచ్చే పరిస్థితి లో ప్రభుత్వం లేదనీ,

మెడిగడ్డ నుంచి వృధాగా లక్షల క్యూసెక్కుల నీళ్లు వృధాగా పోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు చెరుకుపల్లి రాజిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఒగ్గు నరసయ్య, కేతిరెడ్డి వెంకట నరసింహారెడ్డి,ఉడతల వెంకన్న, బిల్లవేని పరుశురాం, ఎండి సాదుల్, వడియాల సత్యనారాయణ రెడ్డి, బాల గౌడ్, వోల్లాల రవి, ఆకుల శ్రీనివాస్, పండుగు భాస్కర్, చిలువేరు సంతోష్ రెడ్డి,అవారు బాబు, సతీష్, బాలయ్య, అక్కరవేణి చంద్రమౌళి, బుర్ర బాలకిషన్ యాదవ్, నవీన్ ముదిరాజ్, పత్రి అంజయ్య యాదవ్, ఓరుపుల రాములు యాదవ్,కొట్టే వెంకన్న, కేశవేణి శ్రీనివాస్, కనకయ్య, బైరి బాలయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు...

## రహీంఖాన్ పేట్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**



రోడ్లు బాగు చేయాలి.. అని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూల్ విద్యార్థులతో ఏబీవీపీ ఆధ్వర్యంలో రహీంఖాన్ పేట్ గ్రామంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు అక్కేం నాగరాజు మాట్లాడుతూ.. మండలం లోని రోడ్లు అన్ని కూడా గుంతల మాయంగా మారి రోడ్లు చినుకు పడితే పొలాలను తలపించే విధంగా మారి ఎక్కడ గుంత ఉందొ కూడా తెలియడం లేదని, అదేవిధంగా మండలం లోని నారెడ్డిపల్లె, తెనుగువని పల్లె, ఇలా చాలా వరకు చిన్న పల్లల్లో రోడ్లు లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఇల్లంతకుంట మండలం లోని పరిసర గ్రామాల నుండి మోడల్ స్కూల్ కి వచ్చే విద్యార్థులు ప్రతి గ్రామంలో గుంతల రోడ్లు ఉన్నాయి అని ఆటోలో రావాలి అంటేనే భయంగా ఉంది అని అనంతారం బిక్క వాగు బ్రిడ్జి, అనంతారం నుండి రహీంఖాన్ పేట కు వెళ్లే రోడ్డు చాలా పెద్ద గుంతలు పడి ఆటో, బస్ లు వెళ్ళడానికి కూడా ఇబ్బందిగా ఉందనీ ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయకుంటే రానున్న రోజుల్లో తీవ్ర ఉద్యమాలు చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు


## ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయం అందజేత..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

బోయినిపల్లి మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోరేం గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ బాలు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, శనివారం రోజున బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వేముల చిరంజీవి, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షాదుల్లా, కోశాధికారి రోమాల తిరుపతి, సభ్యులు రెడ్డవేణి తిరుపతి, దుంపటి శ్రీనివాస్, బుర్ర శివ, మజీద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# భారత్‌లో అర్జెంటీనా ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఫుట్‌బాల్ అభిమానులకు శుభవార్త! ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా జట్టు భారత్‌లో బరిలోకి దిగనుంది. నవంబర్ 10 నుంచి 18 మధ్యలో కేరళలో జరగనున్న ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు స్థానిక ఫుట్‌బాల్ టీమ్‌తో తలపడనుంది. వేదికగా కొచ్చి లేదా తిరువనంతపురం నిర్ణయించే అవకాశముంది. కేరళ క్రీడాశాఖ మంత్రి అబ్దుర్‌రెహమాన్ శనివారం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అదే సమయంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ కూడా తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ సమాచారం షేర్ చేసింది. “లియోనల్ స్కాలోని నాయకత్వంలోని అర్జెంటీనా జట్టు ఈ ఏడాది రెండు ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడనుంది. అక్టోబర్‌లో అమెరికాలో, నవంబర్‌లో భారత్‌లో” అని తెలిపింది. 2022లో ఖతార్‌లో జరిగిన ఫిఫా ప్రపంచకప్‌ను అర్జెంటీనా ఘనవిజయం సాధించి చరిత్ర సృష్టించింది. ఫైనల్లో మెస్సీ సేన ఫ్రాన్స్‌పై చిరస్మరణీయ విజయం అందుకున్న సంగతి గుర్తుండే ఉంటుంది.

# సెప్టెంబర్ 5న ‘లిటిల్ హార్ట్స్’

**బలగం టీవీ, హైదరాబాద్**

మౌళి తనూజ్, శివాజీ నాగారం జంటగా నటించిన చిత్రం ‘లిటిల్ హార్ట్స్’. సాయి మార్తాండ్ దర్శకుడు. ఆదిత్య హాసన్ నిర్మాత. ఈటీవీ విన్ ప్రొడక్షన్స్‌లో సినిమా రూపొందింది. సెప్టెంబర్ 5న నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ శనివారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 12న ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు మొదట్లో ప్రకటించారు. అయితే.. ఇప్పుడు ఒక వారం ముందుగానే థియేటర్లలోకి తెస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ టీమ్ స్పందిస్తూ.. ‘ప్రచార చిత్రాల కారణంగా సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు ఏర్పాడ్డాయి. ఆ నమ్మకంతోనే ఓ వారం ముందుగానే వస్తున్నాం. మా ‘లిటిల్ హార్ట్స్’ అందర్నీ కడుపుబ్బా నవ్విస్తుంది.’ అని తెలిపారు. రాజీవ్ కనకాల, ఎస్.ఎస్.కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్ తదితరులు ఇతరపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సూర్య బాలాజీ, సంగీతం: సింజిత్ యెర్రమల్లి.




# తేజ సజ్జాతో
# పీపుల్ మీడియా మరో సినిమా

**బలగం టీవీ, హైదరాబాద్**



హనుమాన్ విజయంతో పాన్ ఇండియా హీరోగా నిలిచిన తేజ సజ్జా, తన తదుపరి చిత్రం మిరాయ్తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. ఇక అభిమానులకు సర్‌ప్రైజ్‌గా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, తేజ సజ్జాతో మరో కొత్త సినిమాను ప్రకటించింది. “గతంలో లేనంత బలంగా.. ఎప్పుడూ లేనంత క్రూరంగా” అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా 2027 సంక్రాంతి సందర్భంగా విడుదల కానుందని పోస్టర్‌లో ప్రకటించింది. రాయలసీమ నుంచి ప్రపంచం అంతం అయ్యేవరకు అంటూ ఒక శక్తివంతమైన పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. అయితే ఈ కొత్త చిత్రానికి దర్శకత్వం వహించేది ఎవరు అనేది ఇంకా గోప్యంగానే ఉంచింది.




# నిర్ణయాలు కఠినంగా తీసుకున్నా ఫలితాలు బాగుంటాయి

(మొదటి పేజీ తరువాయి)

హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అన్ని కూల్చివేతలను హైడ్రాకు ఆపాదిస్తున్నారన్నారు. ఫాతీమా కాలేజా, మల్లారెడ్డి కాలేజా ఇంకోటా అనేది చూడమని, ప్రభుత్వ స్థలాలు, నాలాలు, చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. 2015 – 2016లో ఫాతీమా కాలేజ్ కట్టారని, ఆ సమయానికి అక్కడున్న చెరువుకు ప్రాథమికంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణ కాలేదన్నారు. ఫాతీమా కాలేజ్ ఏర్పాటు తర్వాత అక్కడ బస్తీలు, నివాస గృహాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇప్పటి వరకు 80శాతం చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ అయింది కానీ ఫైనల్ నోటిఫికేషన్ కాలేదన్నారు. కొద్ది నెలల్లోనే నగరంలోని అన్ని చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను సైంటిఫిక్‌గా హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ చేస్తామన్నారు. హైడ్రా ఏర్పాడిన తర్వాత అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. హైడ్రా రాకముందు నిర్మాణాలు, పర్మిషన్లు తీసుకుంటే వాటిజోలికెళ్లబోమని స్పష్టం చేశారు. పేదల ఇండ్లను కూల్చబోమన్నారు. తప్పని పరిస్థితుల్లో కూల్చివేస్తే అన్ని విధాలా విచారించి ప్రభుత్వం నష్టపహారం చెల్లిస్తుందన్నారు. కూకట్‌పల్లిలో షెడ్స్‌ను మాత్రమే కూల్చివేశాం కానీ పేదల ఇండ్లను కూల్చలేదన్నారు. ఎవరైనా తమకు అన్యాయం జరిగిందని భావిస్తే కోర్టుకెళ్లొచ్చని తెలిపారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలో చెరువుకు ఫైనల్ నోటిఫికేషన్ కావడంతోనే కూల్చేశామని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. జయభేరీ లేఆవుట్‌లో పార్కులు, రోడ్లు, ఇతర వాటికి మొదట్లో స్థలాలను కేటాయించి, ఆ తర్వాత కబ్జాచేశారన్నారు. వాటిపై ఫిర్యాదులు అందడంతోనే అక్కడ కూల్చివేతలను జరిపామని చెప్పారు. గండిపేట్‌లో సైతం ప్రజాప్రతినిధుల ఫామ్‌హౌజ్‌లు, స్థలాలను కూల్చివేశామన్నారు. కబ్జాలతో కాంక్రీట్ జంగల్‌గా మారుతుండడంతోనే గ్రౌండ్ వాటర్ పెరగడం లేదని, పొల్యూషన్‌తో యువకులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం అనారోగ్యపాలవుతున్నారన్నారు. హైదరాబాద్‌ను ఫ్రీ ప్లాస్టిక్ నగరంగా చేసేందుకు ముఖ్యమంత్రి అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎవరూ అపోహలకు వెళ్లకుండా రాబోవుతరాలకు ఆరోగ్యకరమైన భవిషత్తును కల్పించాలని కోరారు. కబ్జాలకు గురైన చెరువులను కాపాడడంతో అక్కడ మంచి వాతారణం ఏర్పడిందని, స్థానికులు వాకింగ్‌కు వెళ్తున్నారని తెలిపారు. హైడ్రాను విమర్శించిన వారే ఇప్పుడు పొగడ్తలతో ముంచెత్తుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధానకార్యదర్శి కే.రామ్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మిరాయి నుంచి కొత్త పోస్టర్

**బలగం టీవీ, హైదరాబాద్**




‘హను–మాన్’ఫేం తేజ సజ్జా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ ‘మిరాయ్’. ఇందులో తేజ సజ్జా సూపర్ యోధాగా కనిపించనున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2డి, 3డి ఫార్మాట్‌లలో, ఎనిమిది భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. శనివారం హీరో తేజ సజ్జా పుట్టినరోజు. ఈ సందర్భంగా మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ఇందులో సూపర్ యోధగా తేజ సజ్జా కనిపిస్తున్నారు. ఆయన పాత్రలో ఉండే పట్టుదల, ధైర్యం, ‘మిరాయి’ కథలో ఉండే హై వోల్టేజ్ డ్రామాను ఈ లుక్ ప్రజెంట్ చేస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా హిందీ వెర్షన్‌ను బాలీవుడ్ టాప్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. శ్రియ శరణ్, జయరామ్, జగపతిబాబు ఇతరపాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: మణిబాబు కరణం, సంగీతం: గౌరహరి. ఇదిలావుంటే.. ‘మిరాయ్’ చిత్రాన్ని నిర్మిస్తున్న పీపుల్ మీడియా సంస్థలోనే తేజ సజ్జా మరో సినిమా చేయబోతున్నారు. ఈ సినిమా కూడా ‘మిరాయ్’ తరహాలో భారీగానే ఉంటుందని శనివారం నిర్మాతలు ప్రకటించారు.

# ప్రభుత్వం తీరు దొంగే.. దొంగ దొంగ అన్నట్లుంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళిక లేదు, కార్య చరణ లేదని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నాం, బాధ్యతగా ఉండాలనే సోయి కూడా లేకుండా ప్రతి వైఫల్యాన్ని బీఆర్ ఎస్, కేసీఆర్ పై వేస్తూ రంకెలేయడం తప్ప 22 పాలనలో ఒరగబెట్టిందేమిటి అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లనే, ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చేతగాని తనం వల్లనే రాష్ట్రానికి ఎరువుల కొరత వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఈరోజు యావత్ రైతాంగాన్ని యూరియా కోసం నడి రోడ్డుపై నిలబెట్టిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది సాగు నీళ్ల ఇవ్వడంలో ఫెయిల్, పంట కొనుగోళ్లలో ఫెయిల్, 500 బోనస్ ఇవ్వడంలో ఫెయిల్, రైతు భరోసా ఇవ్వడంలో ఫెయిల్, రైతు రుణమాఫీలో ఫెయిల్, చివరకు యూరియా సరఫరా చేయడంలో ఫెయిల్ అని విమర్శించారు. రైతులను కన్నీళ్ల పెట్టిస్తున్న ఈ ప్రభుత్వం ఒక ఫెయిల్యూర్ ప్రభుత్వమని మండిపడ్డారు.

దేశానికి అన్నం పెట్టే రైతుల చేతులతో కాళ్లు మొక్కించుకుంటున్న ఈ ప్రభుత్వానికి తప్పకుండా ఉసురు తగులుతుందని అన్నారు. రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మీద నిందలు మాని, రైతుల యూరియా కష్టాలపై ఇప్పటికైనా దృష్టి సారించాలని హితవు పలికారు. యూరియా, ఎరువుల కొరత పై సమీక్ష నిర్వహించి, రైతాంగానికి అవసరమైన యూరియా వెంటనే సరఫరా చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# ‘జటాధర’ నుంచి దివ్య ఖోస్లా లుక్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ చిత్రాల్లో హీరో సుధీర్ బాబు నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘జటాధర’ కూడా ఒకటి. ఈ సినిమాను వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ డైరెక్ట్ చేస్తున్నారు. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఇటీవల రిలీజ్ అయింది. ఈ టీజర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉండటంతో ఈ మూవీపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయ్యాయి. ఇక ఈ సినిమాతో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుంది. ఆమె ఈ సినిమాలో ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుంది. అయితే, తాజాగా ఈ సినిమాలో మరో బ్యూటీ దివ్య ఖోస్లా ‘సితార’ అనే పాత్రలో నటిస్తుందని.. ఆమె పాత్ర ఈ సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందని మేకర్స్ ఓ సరికొత్త పోస్టర్ ద్వారా పరిచయం చేశారు. సింపుల్ లుక్‌తో శిల్పాలను పరిశీలిస్తున్నట్లుగా ఆమె పోస్టర్‌ను మేకర్స్ రివీల్ చేశారు. ఇక ఈ పాత్రతో సినిమా కథ ముందుకు సాగుతుందని వారు తెలిపారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేర్న అరోరా సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను త్వరలోనే వెల్లడించనున్నారు.

# అన్నా అంటేనే.. ఉన్నానంటూనే..
# ఫుల్ వీడియో సాంగ్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కింగ్డమ్. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా నటించగా.. సత్యదేవ్ కీలక పాత్రలో నటించాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించాడు.తాజాగా ఈ సినిమా నుంచి ఎమోషనల్ సాంగ్ అన్నా అంటేనే పాట ఫుల్ వీడియోను విడుదల చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది.